# —: చెమిటి నాటకం :—

శ్రీ అవ్వారి వేంకటేశ్వరశర్మ

ఒకరోజున ఒకరైతు పొలంనించీవస్తూ, దోవలో వొక బాటసారితో కలుసుకొని "యేవూరు బాబూ మీది?" అంటాడు.

గిరిభట్టు:-మాదా పావులూరు నాయనా! మీది యే గ్రామం?

రైతు:-మాది కనపడే ఆ వూరు లేండి.

గిరి:-పుప్పమావులూరు యిక్కడికి ఇంకా యెంత దూరంవుంది నాయనా!

రైతు:-ఒకటిన్నర ఆమడ దూరంవుంది.

గిరి:-(తనలో) అయ్యో! యిప్పటికే పది ఘడియల పొద్దెక్కిందే! యీ ఆరుకోసులూ నడిచేటప్పటికి భోజనంవేళ మిగిలిపోవడమే కాకుండా యీ వేసంగిలో నాలికయెండి యెక్కడన్నా పడిపోతానేమో! యిహ యిప్పుడు ప్రయాణం చేస్తే నా ప్రాణాలు నిలుస్తయ్యనిగూడా తోచదు. (పైకి) మీ గ్రామంలో బ్రాహ్మణ కుటుంబాలెన్ని వున్నాయి బాబూ!

రైతు:-యెందుకు నాయనా! మా గ్రామంలో బ్రాహ్మ లంతగా లేరే! వొక్క యిల్లు వర్ధనమ్మగారిది మాత్రంవుంది. యెందుకూ?

గిరి:-యేంలేదు. నేను ఉప్పమావులూరు పోవాలి. ఆ వూళ్ళో మా బంధువులుంటే పోయిరావల సొచ్చింది. ఆ వూరు చేరేటప్పటికి బాగా అన్నంవేళ మిగిలేటట్లున్నది. దోవలో అడ్డం పడ్తానేమోనని భయంగాగూడా వుంది. యెక్కడన్నా భోంచేసి వెళ్దామని.

రైతు:-అయ్యో! బాబూ! ఆ ముండే! యెంగిలి చేత్తో కాకికిగూడా విదిలించదే. భోజనమే? పెట్టడమే? బొత్తిగా? నల్లమేకను తెచ్చుకోవాల్సిందే. ఆ అసాధ్యపు ముండదగ్గర యెవరి మాటలూ యేంసాగవు బాబా! యెండెక్కుతున్నది మీకూ నాకూగూడా! తొందరపడి నడవటం మంచిది. నేను వెళ్లివస్తా. (అంటూ తొందరగా వెళ్తాడు.)

గిరి:-ఆ ముండ చాలా అసాధ్యపుముండ అన్నాడే! యెట్లాగబ్బా? కానీ నా సాయశక్తులా ప్రయత్నించి, యెట్లాగైనాసరే ఆ యింట్లో భోజనం చేసి మరీ పోవాలి. (అంటూ బయలుదేర్తాడు వూళ్ళోకి.)

గిరిభట్టు వూళ్ళోకివెళ్లి బ్రాహ్మణుల యిల్లు యెక్కడ? అని తెలుసుకున్నాడు. అక్కడికి వెళ్లేసరికి 12 గంటలయింది. వర్ధనమ్మగారివీధి గుమ్మం తలుపుతీసి వున్నది. వీపున దేవతార్చన మూటా, నెత్తిన కొద్దిగా చినిగిపోయిన తాటాకుల గొడుగూ, కాళ్లకు చెప్పులూ, వీటితో లోపల వాకిలివద్దకు యెకాయికీన స్వతంత్రంగా వెళ్లి ముందుగావున్న పంచపాళీలో చెప్పులు విడుస్తున్నాడు.

ఈ సంగతి చూచిన వొక చిన్నది లోపలికివెళ్లి "బామ్మగారూ! యెవరోనండీ వొక ముసలాయన 50 యేండ్ల వాడుగా వున్నాడు, చేతులో గొడుగూ, వీపున మూటతో వచ్చాడు" అని చెప్పింది. తత్క్షణమే రివ్వున బయలుదేరి వర్ధనమ్మ వచ్చిచూచి "ఏమయ్యోయ్! ఎవరు నువ్వు? చెప్పులూ, గిప్పులూ యిక్కడ విడవటానికి వీల్లేదు" అని కఠిన స్వరంగల కంఠంతో అన్నది. గిరిభట్టు మనసులో యిదివరకు మార్గ మధ్యంలో ఆలోచించుకుని వుంచిన నాటకాన్ని ప్రారంభించసాగాడు. అతి చెమిటి వాడిలాగా చెవుకు చెయ్యి అడ్డంపెట్టుకొని, "ఏవూరినించి వస్తున్నా వంటారూ? పావులూర్నించీ. పుప్పమావులూళ్ళో మా బంధువుల యింటికి పోతున్నానమ్మా!"

వర్ధ:- కాదయ్యా! మా యింట్లో వద్దంటున్నా.

గిరి:- ఏమంటారమ్మా! యెందుకు పోతున్నా నంటారూ? బంధువుల్ని చూచి చాలా కాల మయింది. చూచి వద్దామని పోతున్నా తల్లీ!

వర్ధ:-(పెద్దగా) కాదయ్యా! మాయింట్లో వల్ల కాదు అంటున్నా.

గిరి:- ఏమంటారూ? మొగవాళ్లు ఇంట్లో లేరంటారూ? ఎట్లా తల్లీ! అకాలమయింది. కానీలే, యేంచేస్తాను? మగవాళ్లు వచ్చిందాకా నే వుంటానులెండి.

వర్ధ:- కాదయ్యా! భోజనాలు గీజనాలూ ఇక్కడ వీల్లేదు.

గిరి:- అమ్మా! యేమంటారూ? ఇవ్వాళేవరూ మగవాళ్లు రారంటారూ? పోనీలేమ్మా! ఎప్పుడూ మొగవాళ్లింట్లో వుంటారూ?

వర్ధ:- పోవయ్యా! అసలు వీల్లేదు.

గిరి:- ఏమంటారూ! పెద్దవాణ్ణిలే అమ్మా - బాగా వినిపించదు. కూరా నారా లేదంటారూ? పోనీలేతల్లీ! అన్నీ వున్న రోజులే వుంటాయా? మాయింట్లో మాత్రం రోజూ పచ్చికూరలతోనే తింటున్నామా? ఏదో పప్పూ పులుసూ వుంటుందిగా! చాలులెండి.

వర్ధ:-(విసుగుతో) ఓరి చెమిటి - నీ అమ్మకడుపు పూడ్చా! పోవయ్యా!

గిరి:- ఏమంటారూ? ఆడవాళ్లమే నంటారూ? కానీలేఅమ్మా? ఎట్లామరి అవసరమొచ్చినప్పుడూ?

వర్ధ:-(దగ్గరికివచ్చి బిగ్గరగా) ఏమయ్యా! నీకేమైనా రోగమా? వినిపించుకోవేం?

గిరి:- ఏమంటారూ? పిల్లత్తో ఆలస్యమౌతుందంటారూ? కానీలే తల్లీ! రోజూ పెందలకాడే తింటున్నామా? ఈ లోపల నేనూ స్నానం సంధ్యా చేసుకుంటానూ, సరిపోతుంది.

వర్ధ: (ప్రాణము విసిగి బేజారై) అమ్మాయ్! లక్ష్మీ! యీ చెమిటి ముండాకొడుకు ఇవ్వాళ మనకెక్కడ దాపరించాడే? నువ్వైనా ఘట్టిగా చెప్పవే. (అని మనమరాలికి చార్జి వప్పగించి లోపలి పనులు సవరించుకుంటానికి గామోలు వెళ్లింది.)

అప్పుడు మనుమరాలు లక్ష్మి, "ఏమయ్యోయ్! చెమిటి బ్రాహ్మడా! మా యింట్లోవల్ల గాదు వెళ్లమంటల్లేదుటయ్యా?" అని తన తెలివి తేటలను వుపయోగించి చూచింది.

గిరి.- ఏమంటా అమ్మాయ్! కాస్సేపు పడుకోమంటావు ఎండలో వచ్చానని (అంటున్నంతలో లోపలనుంచీ అపరకాళీ అన్నట్లు వర్ధనమ్మ వస్తూ "పడుకోమని కాదు, వాగులో దోల్లిస్తామంటున్నది" అన్నది. గిరిభట్టు "ఏమంటారమ్మా! పడుకుంటే నా స్నానం సంధ్యా వెనుక పడుతుందనా? నిజమేనమ్మా! స్నానంచేసివస్తా. చెంబివ్వం"డని మొండికి తిరిగాడు. వర్ధనమ్మకు విసుగుబుట్టి "ఎట్లాగో నీ తాడు తెంచుకోపో" అని పాషాణం బద్దలయ్యేటట్లు పలికింది.

ఇది విని ఆయన, మనసులో మనపన్నుగడ కొంతవరకూ ఫలించిందను కొని, వాకిట్లో నీళ్లతొట్టి దగ్గరనున్న ఆమె చెంబు తీసుకోని వెళ్లి, స్నానంచేసి, గుడ్డలు ఆరవేసుకోని, సంధ్యావందనాది కృత్యాలు కొంతవరకు పూర్తిచేసుకోని, బయలుదేరి మళ్లీ యీ గృహానికే చేరుకున్నాడు. వచ్చి అక్కడ ఒకపీట వుంటే కూర్చున్నాడు.

ఇష్టమున్నప్పటికీ లేకపోయినప్పటికీ, మొండికిబడ్డ ముండాకొడుకును యేంచేస్తారూ? కాబట్టి యీయన అతిచెమిటి ముండాకొడుకని వీరి అభిప్రాయమవటం చేత ఏ విషయానికైనా సంజ్ఞ చేయ్యసాగారు. కూర్చున్నతరువాత, కోరవున్న జపం వగైరా అంతా పూర్తి చేసుకున్నాడు. ఎట్లాగో విస్తరివేసి వడ్డించారు. భోజనసమయంలో ఏపదార్థం కావాలిసిందీ అడగటంకూడా సంజ్ఞతోనే జరిపాడు.

యీయనమాత్రం భోజనంచేసి. ఉదయంనుంచీ చేసిన ప్రయాణబడలిక, అకాలభోజనం బడలికా, తీరగ లందులకై కొంతసేపు నిద్రబోయి, లేచి, కొంచెం మంచి తీర్థం పుచ్చుకొని, వెళ్లి వస్తానమ్మా! అని చెప్పాడు. వర్ధనమ్మగారు “నాయనా! తల్లు ఇవ్వాళ మావధ పట్టావుతండ్రీ!” అన్నది వినబడదుగదా! అని మామూలుగా.

“ఏమండోయ్! వర్ధనమ్మగారూ! మిమ్మల్ని నే నేంచేశానండీ? చెముడు యేకోశమందూ లేని నన్ను చెమిటి ముండాకొడుకుగా భావిస్తూ మీరు నానా తిట్లూ తిట్టేరు కాని “మీరొకందుకు పోస్తున్నారు, నేనొకందుకు తాగుతున్నా” నన్నట్లుగా మీరు భోజనం పెట్టకుండా వెళ్లగొట్టటానికి తిట్టారు. అకాలమై యెండ దెబ్బకు తట్టుకోలేక ఆకలిబాధకై “ప్రాణవిత్తమానభంగ మందు...బొంకవచ్చు నఘము పొంద దధిప” అని భారతంలో చెప్పివుండటంచేత, “ఉదరనిమిత్తం బహుకృతవేషః” అన్నట్లుగా భోజనంకోసం అట్లానటించాను. క్షమించండి.

“నేను కేవలం యాచకులమాదిరిగా పీడించేవాణ్ణి కాదులేండి. నాకూదిబ్బోపాటో ఒక పాతిక యకరాల మామూలు పల్లంభూమివుంది. అగ్రహారీకుణ్ణి గూడా. మీరు భోజనం పరాయి వాళ్లకు పెట్టరని దారిలో ఒక పెద్ద మనిషి చెప్పి నాకు సహాయం చేశాడు. ఇహా మిమ్మల్ని బ్రతిమిలాడినా ప్రయోజనముండదనీ, భోజనంచేయ్యకుండా అవతల నాగమ్యస్థానం చేరటం కష్టమనీ, మీతో అట్లా చెమిటివాడిలాగా నటించాను. మీరు తిట్టినతిట్లు నాకు బాగా వినబడుతూనే వున్నయి. కానీ, యిందుచేతనే వాటిని పాటించలేదు.

తల్లీ! యిదే విధంగా మీయింటి కొక దూరపు బంధువుల్లో వాడు ధనికుడువస్తే మీరు ఎంతో హడావుడిగా స్నానానానికి వేణ్ణీళ్లు కాచి యిచ్చి, రుద్దుకుంటానికి సబ్బులూ అవీ యిచ్చి, కూరలూ, పప్పూ, పాయసాలు చేసి ప్రేమతో పెట్టారు. కానీ అతనెన్ని చోట్లనో కాఫీ హోటళ్లు బాగుచేసి వచ్చిన వాడవటంచేత భోజనం తృప్తిగా చెయ్యక, విదిలించి, అటుకొంతా, ఇటుకొంతా, చిమ్మిపోతాడే! అదిమీకు ఐహిక సాధనమూగాదు, ఆముష్మిక సాధనమూగాదు. మాబోటి అన్నాతురులకు భోజనం పచ్చడి మెతుకులతో పెట్టినా, పారెయ్యకుండా తృప్తిగా భుజిస్తారు. దీనివల్ల యిహమూ పరమూగూడా వుంటాయి గదా! తల్లీ! అని” చెప్పసాగాడు గిరిభట్టు.

వర్ధనమ్మ నివ్వెరబోయి “స్వామీ! తెలియక కొంతా, తెలిసిన కొంచమైనా ఆచరించటానికి బద్ధకించే ఆడవాళ్లంగాబట్టి అట్లా అన్నాను, మన్నించండి స్వామీ! మీరు నడిపిన నాటకమంతా నా కిప్పుడు జ్ఞానాన్ని కలిగించింది” అని అన్నది.

“తల్లుల్లారా! శరీరాయాసానికి వెరిచి, అన్నాతురులకు భోజనమూ, దప్పిక అయిన వాళ్ళకు మంచి నీళ్ళూ, యివ్వటానికి మీరు వంకపెట్టితే పురుషులు మిమ్మల్నేం చెయ్యలేరు. కానీ మీరు ఐహికానికీ, ఆముష్మికానికీ, సాధనమైన మార్గం చూచుకుంటుండాలమ్మా!”

మన ప్రభుత్వంవారుగూడా యిప్పుడు చెప్పేదేమిటంటే ‘మీరు సాధ్యమైనంతవరకూ బియ్యంతో పిండివంటలూ మొదలుగాగల యితరమైన అల్పాహారాలు చెయ్యటం మానుకొని మితంగా బియ్యాన్ని వుపయోగించుకొని, అన్నాతురులై బాధపడుతుండే తక్కిన మానవులకు సహాయపడవలసిందనేనమ్మా!”

అని హెచ్చరిస్తూ గిరిభట్టు తను వెళ్లాల్సిన గ్రామానికి బయలుదేరాడు.